క్లుప్తంగా

ఎక్స్‌రే టెక్నీషియన్‌పై చర్యలు

రాజంపేట : సదరం కార్యక్రమ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాజంపేట ప్రాంతీయ వైద్యశాల ఎక్స్‌రే టెక్నీషియన్ కిరణ్‌పై ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి డిప్యూటేషన్‌పై పంపుతున్నట్లు ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కిరణ్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీఎస్ రాజు అందజేస్తుండగా కిరణ్ తీసుకోకపోవడంతో, వాట్సాప్‌కు రిలీవింగ్ లెటర్ పంపినట్లు సూపరింటెండెంట్ విలేకరులకు తెలియజేశారు.

ఇటు 'వంక' చూడరూ..


వంక దాటుతున్న గ్రామస్తులు

సుండుపల్లె : వర్షం పడితే వంక దాటడానికి ఆ గ్రామ ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మండల పరిధిలోని మడితాడు గ్రామ పంచాయతీ నాయునివారిపల్లెలో వర్షం పడితే వంకలో అధికంగా నీరు వచ్చి దానిని దాటేందుకు ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామంలో 60 కుటుంబాలు జీవనం సాగిస్తుండగా, ప్రజలు పొలాలకు వెళ్లాలన్నా, పశువులను మేతకు తీసుకెళ్లాలన్నా వంక దాటాల్సిందే. వర్షాలు కురిసినప్పుడు వంకలో దాటేందుకు ప్రాణాలను పణ్ణంగా పెడుతున్నామని, కూటమి నాయకులు, అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఎస్ఐకు సత్కారం


ఏఎస్ఐను సత్కరిస్తున్న పోలీసులు

నందలూరు : ఏఎస్ఐ సుబ్బరాయుడు సేవలు ఎనలేనివని రాజంపేట రూరల్ సీఐ బివి రమణ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సుబ్బరాయుడుకు ఆత్మీయ అభినందన సభను ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో వక్తలు సుబ్బరాయుడు సేవలను కొనియాడరు. అనంతరం పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు మండల ప్రముఖులు పాల్గొన్నారు.

నియామకం


ప్రశాంత్

రాజంపేట టౌన్ : రెవెల్యూషనరి స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పుల్లంపేట మండలం అనంతసముద్రానికి చెందిన తొండంనాటి ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తామని ప్రశాంత్ పేర్కొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

ఓబులవారిపల్లె : ముదినేపల్లి బండపల్లి ఎల్లమ్మ గుడికి బుధవారం టిడిపి నాయకులు ముక్కా వరలక్ష్మీ లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించినందుకు వారు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

రాయచోటి టౌన్ : అక్టోబర్ 5వ తేదీన తిరుపతిలో భక్త కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు, న్యాయవాది కందుకూరి ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. తిరుపతిలో భారీ స్థాయిలో చేపట్టే ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కురుబ సంఘం నాయకులు, ప్రజలు తరలి రావాలని కోరారు.

డ్రగ్స్‌తో జీవితాలు ఛిద్రం


లక్కిరెడ్డిపల్లి: మాట్లాడుతున్న సీఐ కొండారెడ్డి

లక్కిరెడ్డిపల్లి/గాలివీడు : యువత మత్తుకు బానిసై జీవితాలు ఛిద్రం చేసుకోవద్దని లక్కిరెడ్డిపల్లె సీఐ వెంకట కొండారెడ్డి, గాలివీడు ఎస్ఐ రామకృష్ణలు వేర్వేరు కార్యక్రమాల్లో తెలిపారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో, గాలివీడులో రవిచంద్ర సీబీఎస్సీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం ప్రాణంతకరమని, ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. మత్తు పదార్థాలతో బంగారు జీవితం నాశనం అవుతుందని చెప్పారు. అలానే ఆర్థిక నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, పాఠశాలల అధ్యాపకులు, సిబ్బంది, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు మండలాల పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై రచ్చ.. సమస్యలపై చర్చ


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా


సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు, అధికారులు

- ప్రబలుతున్న విష జ్వరాలపై సభలో సభ్యుల ప్రస్తావన
- కుక్కల బెడద తప్పించాలంటూ పట్టు
- శానిటేషన్ సిబ్బంది జీతాల చెల్లింపు ఆపాస్‌కు అప్పజెప్పాలంటూ తీర్మానం
- పలు పాలనాపరమైన అంశాలకు ఆమోదం తెలిపిన కౌన్సిల్

రాయచోటి టౌన్ : రాయచోటి మున్సిపాలిటీలో పారిశుధ్య లోపంపై కౌన్సిల్ మీట్‌లో కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం రాయచోటి మున్సిపల్ సభాభవనంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా అధ్యక్షతన కమిషనర్ జి. రవి కుమార్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులలో పారిశుధ్యం లోపంతో ప్రజల ముక్కులు పగిలిపోయేలా దుర్వాసన వెదజల్లుతోందని కౌన్సిలర్లు మండిపడ్డారు. అలానే దోమల బెడద ఎక్కువై ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నా అధికారులు తీరు మారడంలేదని కౌన్సిలర్లు సభ దృష్టికి తెచ్చారు. విష జ్వరాలతో బాధపడుతున్న వారు రాయచోటిలోనే కాకుండా తిరుపతి, బెంగుళూరు వంటి పట్టణాలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారని ఆవేదనను తెలియజేశారు. సమావేశంలో మొత్తం 27 అంశాలపై చర్చలు జరిపారు. వీటిలో ప్రధానంగా పారిశుధ్యంపైనే చర్చ సాగింది. శానిటేషన్ వర్కర్లకు సకాలంలో జీతాలు ఇవ్వకపోతే ఎలా అని పాలంరెడ్డి విజయ లేవనెత్తగా స్పందించిన అధికారులు శానిటేషన్ విభాగంలో అవకతవకలు జరిగాయని దీంతో కార్మికులకు జీతాలు ఆగాయని తెలియజేశారు. కార్మికుల జీతాలకు సంబంధించి ఆడిట్ వాళ్లు కొర్రు వేశారన్నారు. వీరిలో కొందరు పని చేయకుండానే చేసినట్టు, మరికొందరు అసలు పనికి రాకుండానే జీతాలు తీసుకున్నారని అధికారులు ఆరోపించారు. అలాగే మస్టర్లు వేయకుండా పని చేస్తున్నారని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులలో ఒకరైన అగ్గిరాముడు జూలై నెలలో పదవీ విరమణ అవ్వాలని, విషయం తెలియని అధికారులు విధులు అప్పగించారని సభలో సమాధానమివ్వగా, పని చేసిన కారణంగా ఆయనకు జీతం చెల్లించాలని సభ్యులు సూచించారు. అలాగే మరో కౌన్సిలర్ ఫయాజూర్ రహిమాన్ గతంలో 15వ ఫైనాన్స్‌కు సంబంధించి టెండర్ నోటీస్ ఇవ్వగా అప్పుడు ఆ టెండర్లు ఆపేశారు. అదే టెండరు ఇప్పుడు వేస్తున్నారు. అప్పుడు ఎందుకు ఆపారు. ఇప్పుడెందుకు వేస్తున్నారు మాకు రాతమూలకంగా సమాధానం ఇవ్వాలని అప్పుడే పరిపాలన ఆమోదం తెలుపుతామన్నాని పట్టుపట్టారు. అలాగే 4, 5 ప్రతిపాదనలకు సంబంధించిన టెండర్లను చర్చించి తిరస్కరించారు. అలాగే పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ప్రయాణికులు, ప్రజలపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని దీనిని తీవ్రంగా పరిగణించి పరిష్కార మార్గం చూపాలని కమిషనర్‌ను కోరారు. ఆయన స్పందిస్తూ అందరి ఆమోదయోగ్యంతో సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అనంతరం కార్మికులకు ఆపాస్ ద్వారా జీతాలు చెల్లించాలని సభ అమోదం తెలిపింది. అలానే పలు పాలనాపరమైన అంశాలకు సభా సభ్యులు తమ సమ్మతిని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిమీషనర్ జి.రవికుమార్, ఇతర శాఖల అధికారులు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా?

- మండల మీట్‌కు పలు శాఖల అధికారులు డుమ్మా
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి

వీరబల్లి : సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి ఎంపీడీఓను కోరారు. బుధవారం ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వీరబల్లి మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు కొందరు హాజరు కాకపోవడంపై ఆయన మండిపడ్డారు. బాధ్యత గల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు హాజరై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు రాకపోతే సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతి కాదని అధికారుల తీరు మారాలని తెలియజేశారు. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సర్వసభ్య సమావేశాల్లోనే అర్థవంతమైన చర్చ ఉంటుందని, అలాంటి సమావేశాలకు అధికారులు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మీదట జరిగే సమావేశాలకు తప్పకుండా ప్రతి అధికారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్లు, జిల్లా పరిషత్ సభ్యులు హాజరై ప్రజల సమస్యలపై చర్చించి వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అలసత్వం ప్రదర్శితే చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్ బాబు, తహసీల్దార్ ఖాజాబీ, వివిధ మండల శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్లు, జిల్లా పరిషత్ సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాలకు వాలంటీర్లను బలిచేయొద్దు

వీరబల్లి : గత ప్రభుత్వంలో మాదిరిగానే ఇప్పుడూ వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలంటూ బుధవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డికి అన్నమయ్య జిల్లా వాలంటరీ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్రామ ఆధ్వర్యంలో మండలంలోని వాలంటీర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా వాలంటరీ వ్యవస్థను రద్దు చేశారన్నారు. ఎన్నికల ముందు ప్రచారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాలంటరీ వ్యవస్థను కొనసాగించడమే కాకుండా వారి జీతాలను రూ.10వేలకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల అయ్యాక వాలంటీర్లను మోసం చేశారని ఆవేదనను తెలియజేశారు. ఎమ్మెల్యే ఆకేపాటి స్పందిస్తూ నిస్వార్థంగా సేవలందించిన వాలంటీర్లను చంద్రబాబు మోసం చేయడం బాధాకరమన్నారు. వాలంటీర్ల వ్యవస్థ రద్దుతో లక్షలాది మంది కుటుంబాలను రోడ్డున పడేశారన్నారు. ఆ వ్యవస్థను తీసుకొస్తే ప్రజలు ఎక్కడ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుర్తుకు చేసుకుంటారోనన్న స్వార్థరాజకీయాలకు వాలంటీర్లను బలి చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా వాలంటీర్లను పునరుద్ధరించి ప్రజలకు ఇంటివద్దే పథకాలు అందించాలని ఆకేపాటి డిమాండ్ చేశారు.

మైనర్ బాలిక మృతిపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటిలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు బాలిక తల్లి తన పని ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా ఇంటిలో బాలిక ఉరి వేసుకొని కనిపించిందన్నారు. వెంటనే ఇరుగుపొరుగు వారిని పిలిచి ఆస్పత్రికి తీసుకెళ్లగా బాలిక అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారన్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని, అయితే ఆ ఇంటిలో ఎలాంటి గొడవలు లేవని, ఎవరిపై అనుమానం లేదని తల్లి చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మృతిపై అన్ని కోణాలపై అన్ని విధాలుగా దర్యాప్తు చేసి నిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, న్యాయవాది రెడ్డెయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవిశంకర్, సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన పోషణ మాసోత్సవాలు


పోషకాహారాలను ప్రదర్శిస్తున్న అధికారులు


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రూపలక్ష్మి

గాలివీడు : అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, శిశువులు, చిన్నారుల పోషణపై మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సిబ్బంది పేర్కొన్నారు. అందులో భాగంగా బుధవారం గాలివీడు–1 పరిధిలో సూపర్‌వైజర్ శారదమ్మ, సోనీ, సుజాత ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. చిన్నారులు, మహిళల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే పిల్లల ఎదుగుదల

లక్కిరెడ్డిపల్లి : పిల్లల ఎదుగుదలకు పోషక విలువలు కల్గిన ఆహారాన్ని అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రూపలక్ష్మి పేర్కొన్నారు. పోషిత భారత్ సాక్ష్యం భారత్‌లో భాగంగా బుధవారం దిన్నెపాడు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడవ నెల నుంచి చిన్నపిల్లలకు ఆహారాన్ని అలవాటు చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని పిల్లలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలుపాల్గొన్నారు.

వేడుకగా ప్రధాని మోడీ పుట్టినరోజు


ఓబులవారిపల్లె: దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


సాక్షి, నెట్‌వర్క్ : ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు పురస్కరించుకుని మూడు నియోజకవర్గాల పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరిపారు. బుధవారం జరిగిన వేడుకలలో ఆ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దేశాభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అలానే పలు సేవా కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.


యాజమన్య పద్ధతులతో దిగుబడులు

నందలూరు : రైతులు యాజమాన్య పద్ధతులు అవలంభించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రాజంపేట వ్యవసాయ సంచాలకులు శివశంకర్ పేర్కొన్నారు.

మండలంలోని పొత్తపి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలోని పొలాలను ఏఓ మల్లికార్జున, వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీవల్లితో కలిసి పరిశీలించి తర్వాత సభను నిర్వహించారు. ముంపునకు గురైన పొలాలలో నీరు తగ్గిన తర్వాత ఆజాక్సిస్ట్రోబిన్, టేబుకోనజోల్ 1.5 మిలీ, 13:0:45 10 గ్రామ్స్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా పంటలకు వచ్చే తెగుళ్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు భరత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కుటుంబ ఆర్థికాభివృద్ధికి మహిళలే కీలకం


చిట్వేలి : అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అన్సారీ


నందలూరు : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు


పుల్లంపేట : మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం వద్ద..

చిట్వేలి/సుండుపల్లె/నందలూరు/పుల్లంపేట : ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజును పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని అన్ని మండలాల పరిధిలో బుధవారం వైద్యాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కుటుంబ ఆర్థిక పురోగతికి మహిళల ఆవశ్యకతను గుర్తించిన కేంద్రం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు, చికిత్స అందించడమే కాక సమతుల ఆహారంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుందని వైద్యులు తెలియజేశారు. ఆయా ప్రాంతాలలో జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యకు భవిష్యత్తు

రాజంపేట : నేటి సమాజంలో ఫార్మసీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఐదవ జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు – 25 జ్యోతి ప్రజల్వన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యమైన సమాజాన్ని అందించాలంటే ఫార్మసీలు అనేక పరిశోధనలు చేసి, నాణ్యమైన మందులను అందచేయాల్సి ఉంటుందన్నారు. ఏయూ వీసీ డా.సాయిబాబరెడ్డి మాట్లాడుతూ రోగి పూర్తిగా ఆరోగ్యవంతుడు కావడంలో ఫార్మిసిస్టు యొక్క ఔషదాలతోనే కాగగలడన్నారు. ఎండోస్కోపిక్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డా.శ్రీకృష్ణ మాట్లాడుతూ మందుల దుష్ప్రభావాల గురించి వివరించారు. రోగి ఔషధాలను ఉపయోగించి డిశ్చార్జ్ అయ్యేంత వరకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, అధ్యాపకులు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందజేత

పుల్లంపేట : పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వత్తలూరు జెడ్పీహెచ్ఎస్ మొదటి ముగ్గురు విద్యార్థులకు (రూ.5116, రూ.3116, రూ.2116లు) ప్రోత్సాహకాలు అందజేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని కీ.శేలు గుండ్రాచి రామ్మోహన్ రాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు విద్యుత్ శాఖ డిఈ శేఖర్ రాజు, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుడు భానుమూర్తి రాజు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శేఖర్ రాజు, ఉపాధ్యాయులు నాగయ్య, ఫణీంద్ర, పీఈటీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటికి ఆహ్వానం

రాజంపేట టౌన్ : 22 నుంచి ప్రారంభమయ్యే అమ్మవారిశాల దసరా ఉత్సవాలలో పాల్గొనాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని ఆర్యవైశ్యులు ఆహ్వానించారు. మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో గురువారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ఆర్యవైశ్యులు అమర్‌నాథ్‌రెడ్డిని, ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పతి నాగరాజు, సనిశెట్టి రమేష్, బద్రి, బింగి హరి, వెంకటేష్, నాగ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు భద్రపర్చుకోవాలి


వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

పెనగలూరు : మండల రెవెన్యూ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వీఆర్‌ఓలతో సమావేశాన్ని నిర్వహించి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కంప్యూటర్ గదిని క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే పంచాయతీరాజ్ సిబ్బందితో సమావేశమై పంచాయతీ రాజ్ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేశ్వరీ, ఎంపీడీఓ విజయారావు, డిప్యూటీ తహసీల్దార్ సుమని, ఆర్ఐ రామ్మోహన్, వీఆర్‌ఓలు, సెక్రటరీలు, సర్వేయర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి వైద్య పరికరాలు అందజేత


పరికరాలను అందచేస్తున్న అధికారులు

రాజంపేట : రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు ఐడీబీఐ రాజంపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.5లక్షల విలువ చేసే పరికరాలను ఆపరేషన్ థియేటర్‌కు అందించారు. ఇందులో ఎల్ఈడీ మిషన్, ఈసీజీ మిషన్‌లు ఉన్నాయి. సోషల్ సర్వీసెస్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఆ బ్యాంకు మేనేజరు ప్రకాశ్, కడప బ్రాంచి మేనేజరు మధుసూదన్‌రెడ్డిల చేతులమీదుగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.పీవీఎస్ రాజుకు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట ఏరియా హాస్పిటల్ ఆపరేషన్ థియేటరకు విలువ పరికరాలను అందచేయడం సంతోషంగా ఉందన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పాటును అందించిన ఐడీబీఐ మేనేజర్లకు సూపరింటెండెంట్ కృతజ్ఞతలను తెలిపారు. గైనాకలాజిస్టు డా.చట్టేటి అనిల్‌కుమార్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశ్ సర్టిఫికెట్స్ పంపిణీ

రాయచోటి జగదాంబసెంటర్ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో ప్రవేశం పొందిన విద్యార్థులు 3 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి ప్రవేశ్ సర్టిఫికెట్స్ పంపిణీ చేసినట్లు జిల్లా కార్యదర్శి మాడిపాటి నర్సింహారెడ్డి తెలిపారు. జిల్లాలోని 262 పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లలో దాదాపు 2,500 మంది విద్యార్థులకు ఈ సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు చెప్పారు. వీరికి మరో ఆరు నెలల పాటు శిక్షణ అనంతరం మార్చిలో ప్రథమ సోపాన్ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆధ్యాత్మికతకు పెద్దపీట

నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణాలకు రూ.23.1 కోట్లు వెచ్చించాం: శ్రీకాంత్‌రెడ్డి


రామాలయంలో పూజలు జరిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : దేవాలయాల నిర్మాణం కోసం రాయచోటి నియోజకవర్గంలో రూ.23.1 కోట్ల నిధులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాలివీడు మండలంలోని నూలివీడు గ్రామం బోడసానివాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రాయచోటి నియోజకవర్గంలో 76 దేవాలయాలకు రూ.7.60 కోట్లు, సీజీఎఫ్ ద్వారా రూ.15.41 కోట్లు ఖర్చు చెయ్యడంతో దేవాలయాలకు మహర్దశ కలిగిందన్నారు. అందులో భాగంగా సంబేపల్లి రూ.5.46 కోట్లు, చిన్నమండెం రూ.2.98 కోట్లు, రాయచోటి రూరల్ రూ.1.10 కోట్లు, లక్కిరెడ్డిపల్లి రూ.1.02 కోట్లు, రామాపురం రూ.1.02 కోట్లు, గాలివీడు రూ.1.54 కోట్లు, రాయచోటి వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.2.29 కోట్లు ఖర్చు చేశామని చెప్పుకోవడానికి గర్వపడుతున్నామన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం దారుణం

నందలూరు : రాష్ట్రంలో ఈ నెల 15వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం కూటమి ప్రభుత్వ వైఫల్యమని వైఎస్ఆర్‌సీపీ నందలూరు మండల యువనాయకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నందలూరులో మాట్లాడుతూ ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్‌కు బాకీ ఉన్న 2 వేల కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించి, ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ రాష్ట్రంలో నిరుపేదలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను కళ్లు పెద్దవిగా చేసుకుని వాస్తవాలను గ్రహించి, వీలైనంత త్వరగా ఎన్టీఆర్ వైద్యసేవలను పునఃప్రారంభించేలా తగిన చర్యలు చేపట్టాలని లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని కూటమి ప్రభుత్వానికి తెలియజేశారు.